
బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

## ఎల్బీనగర్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

తెలంగాణలో పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఈ నెల 13న ఉండటంతో నగరంలో నివాసం ఉంటున్న ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందు తమ సొంతూళ్లకు తరలివెళ్తున్నారు. దీంతో ఎల్‌బీనగర్ చౌరస్తాలో రద్దీ ఏర్పడింది. ఊర్లకు వెళ్లేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శుక్రవారం నుంచి భారీ ఎత్తున ఎల్‌బీనగర్ చౌరస్తాకు వస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. - లింగోజిగూడ


ఎల్‌బీనగర్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

## కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయం

-యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

మన్సూరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ఘన విజయ సాధిస్తారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమిడి రామకృష్ణరెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజాపాలన అందిస్తున్నారన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నేతలు ప్రభుత్వ గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రంజిత్‌రెడ్డిని గెలిపించండి: దేప

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోకజవర్గం పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని దేప భాస్కర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేశ్ పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మలక్‌పేటలో ఏఐఎంఐఎం భారీ బైక్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా శనివారం మలక్‌పేటలో ఆ పార్టీ ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్బర్‌బాగ్, ఓల్డమలక్‌పేట, ఆజంపురా, చావుని, మూసారంబాగ్, సైదాబాద్ డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీ పాల్గొన్నారు. మలక్‌పేట నుంచి చార్మినార్ ఖిల్వత్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జల్సాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మజ్లిస్ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, నాయకులు షఫీయుద్దీన్, అబ్రార్, అలీమ్, తదితరులు పాల్గొన్నారు.

## జాన్సన్ గ్రామర్ స్కూల్ అరుదైన ఘనత


అభినయ్


మధుహాసిత


లాస్యప్రియ

సాక్షి, సిటీ బ్యూరో: ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి అరుదైన రికార్డు నెలకొల్పామని కుంట్లూరు జాన్సన్ గ్రామర్ స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 17 మంది విద్యార్థులు 95 శాతంపైగా మార్కులు సాధించగా, 90 శాతం మార్కులు దాటిన వారు 60 మంది విద్యార్థులు ఉన్నారని అందులో పేర్కొన్నారు. రాఘవేంద్ర అభినయ్ (99 శాతం),సుంకరణం మధుహాసిత (98 శాతం), కందుల గీతిక లాస్య ప్రియ (97.3 శాతం), నిభనపురి నాగవిరాజ్ (96.5 శాతం ), మొవ్వ యశస్వి (96.3 శాతం) మార్కులతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

## మారుతి స్విఫ్ట్ కొత్త మోడల్ కారు ఆవిష్కరణ



మన్సూరాబాద్: మారుతి స్విఫ్ట్ కొత్త మోడల్ కారును వనస్థలిపురం ఆటోనగర్‌లోని వరుణ్ మోటార్స్‌లో ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్ సీ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యాధునిక టెక్నాలజీతో సరసమైన ధరతో ఈ కొత్త మోడల్ కారును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# కనుల పండువగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

వైభవంగా ఎదురుకోలు ఉత్సవం


అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం 28వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారాతోరణ పూజ, ధ్వజ కుంభారాధన హోమం, ఆరాధన, మూల మంత్ర హోమం, ఉత్సవమూర్తులకు తిరుమంజనం, యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య హంస వాహన సేవ నిర్వహించారు .ఈ సందర్భంగా కొంతమంది బ్రాహ్మణులు స్వామివారి వైపు, కొంతమంది అమ్మవారి వైపు ఉండి వారి గుణగణాలు, గొప్పతనాన్ని కీర్తిస్తూ ఎదురుకోలు ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య అశ్వవాహన సేవ ఘనంగా నిర్వహించారు.

ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు శ్రీలక్ష్మి నారాయణ కల్యాణం..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఆదివారం శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి మహోత్సవం, పూర్ణాహుతి, శ్రీలక్ష్మి నారాయణ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



## ఉదయం నుంచీ బూత్‌ల వద్దే ఉండాలి: ఎమ్మెల్యే


ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ : ఎన్నికల రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్ కమిటీ సభ్యులు బూత్‌ల వద్దే ఉండాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ, హస్తినాపురం, చంపాపేట డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీల సమావేశం శనివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, బూత్‌ల వద్ద అలసత్వం వహించకూడదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, సత్యంచారి, రాజిరెడ్డి, రఘుమారెడ్డి పాల్గొన్నారు.

**మన్సూరాబాద్‌లో...**

మన్సూరాబాద్: మన్సూరాబాద్, హయత్‌నగర్ బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ దయానంద్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, శ్రీధర్‌గౌడ్, చింతల రవికుమార్, కటికరెడబి అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ సన్నిధిలో ఈటల జమున

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ వారు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పూజల్లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో రాజేందర్ గెలుపొంది ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొంటారనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో భారీ చేరికలు


భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్‌లో బీజేపీ, టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రయువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్, పార్టీ నాయకులు అక్బర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి ఓటు వేస్తే బానిస బతుకులే: నల్లా


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు వేస్తే బానిస బతుకులు తప్పవని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో శనివారం చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు నిషికాంత్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, కిరణ్, యాదగిరి పాల్గొన్నారు.

## రాహుల్ ప్రభంజనం చూసి మోదీకి ముచ్చెమటలు

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్


ధ్యానాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మధుయాష్కీ తదితరులు

చంపాపేట: మోదీ గ్యారంటీ అంటే దేశ ప్రజలను మరోమారు మోసం చేయడం గ్యారంటీ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు..శనివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచార చివరి రోజు సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం మరోమారు అధికార పగ్గాలు చేపడితే పెట్రోల్ ధర రూ. 170, గ్యాస్ ధర రూ.1500 లు చేయడమే కాకుండా రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు ఎత్తివేయడం ఖాయమన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒరగబెట్టింది ఏమీలేదని, లక్ష కోట్ల నిధులతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం రూపొందించిన ఐదు గ్యారంటీలు దేశ ప్రజలను ఎంతో ఆకట్టుకుంటున్నాయని, దేశంలో రాహుల్ దీ ప్రభంజనం చూసి మోదీకి ముచ్చెమటలు పడుతున్నాయని మధుయాష్కీ అన్నారు. రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు సుజాతానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, నల్లా రఘుమారెడ్డి, వజీర్‌ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీషిరిడీ సాయి సంస్థాన్‌లో వార్షికోత్సవ పూజలు

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ 25వ వార్షికోత్సవం (దత్తసాయి సహిత పంచాయతన రుద్రయాగం)ను ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తామని పాలక కమిటీ ప్రతినిధులు తెలిపారు. 12న గణపతి పూజ, అంకురార్పణం, 13న గోపూజ, యాగశాల ప్రవేశం, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, 14న చండీ రుద్రహోమం , ఆవాహిత హోమం, సాయంత్రం సాయినాథుని ఊరేగింపు ఉంటుందన్నారు. అలాగే, 15న మూల విరాట్‌కు క్షీరాభిషేకం, మంగళస్నానం, విశేష అలంకరణ, సాముహిక సాయి సత్య వ్రతాలు, 16న సకల బేతాళ హోమం, సాయిదత్త హోమం, లక్ష్మీ నారాయణ సహిత శివపార్వతుల కల్యాణం , అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు అన్నారు.

## అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం: కొప్పుల


ర్యాలీని ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల మీదుగా శనివారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింహా రెడ్డి మాట్లాడుతూ, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మొద్దని కొప్పుల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి హరీష్ రెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ , ముత్యం రెడ్డి, సాయి రాంగౌడ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..**

చంపాపేట: బీజేపీ అభ్యర్థి ఈటల రాంజేందర్‌కు మద్దతుగా శనివారం బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలు కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ...ఈటల రాజేందర్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటే ఎల్‌బీనగర్‌లో దశాబ్దాల తరబడి తిష్ట వేసిన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనపల్లి శ్రీనివాసరెడ్డి, డివిజన్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీజేపీకి అపూర్వ స్పందన..**

చైతన్యపురి: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో విజయ సాధించడం ఖాయమని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజల నుంచి అనుహ్య స్పందన లభిస్తోందన్నారు. నాయకులు చిలుకూరి రాంరెడ్డి, ఆనంద్‌కుమార్, నగేష్, జయప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్‌గౌడ్, వివేకనంద రెడ్డి, మదుసూధన్‌రెడ్డి, కేశవ్ నాయక్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల రవాణా: ఇద్దరి అరెస్టు

నాగోలు: నిషేధిత మత్తు పదార్థాలను రవాణా చేస్తున్న ఇద్దరిని నాగోలు పోలీసులు శనివారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 300 గ్రాముల ఆల్ప్రాజోలం పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..నాగోలు ప్రాంతానికి చెందిన బద్దం త్రిలోక్ ప్రసాద్‌గౌడ్, గడ్డం వెంకటరమణ కలిసి నగరంలో వివిధ ప్రాంతాలకు ఆల్ప్రాజోలం పౌడర్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నాగోలు సీఐ పరుశురాం, ఎస్ శ్రీనివాస్‌లు ఇద్దరినీ అరెస్టు చేసి రూ. 300 గ్రాముల ఆల్ప్రాజోలం పౌడర్‌ను చేసుకొని రిమాండ్ తరలించారు.

# అభివృద్ధి, సంక్షేమం నా లక్ష్యం

- ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి
- మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్


ఎల్‌బీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: అభివృద్ధి, సంక్షేమం తన లక్ష్యమని, తనను ఎంపీగా గెలిపిస్తే మల్కాజిగిరి ప్రాంత ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట, మోహన్‌నగర్, నాగోలు, అల్కాపురి, రాజీవ్‌గాంధీనగర్, ఆర్టీసీ కాలనీ, రాక్ టౌన్, సాయినగర్ కాలనీ, వనస్థలిపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలపై ప్రశ్నించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించడం, ప్రతి నియోజకవర్గంలోనూ ఆదర్శ విద్యాలయాలు, ధర్మాసుపత్రులు నెలకొల్పడం, పేదలకు, రోజువారీ వేతనదారులకు, అల్పాదాయ వర్గాలకు అందుబాటు ధరలతో శ్రేష్టమైన పౌష్టికాహారం అందిస్తానని అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆక్రమణకు గురైన చెరువులను కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవడంతో పాటు సుందరీకరణ, నీటి వనరుల పెంపునకు పాటుపడతానని అన్నారు. నీటి సమస్య లేని మల్కాజిగిరి సాధించడమే తన లక్ష్యమని వైష్ణవీ ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యూహ రచన చేస్తామన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాలకు మెట్రోరైలు విస్తరణకు ప్రయత్నిస్తానన్నారు. అందరూ ఐక్యంగా ఉండి, బ్రహ్మర్షి సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడ్డు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కై లాస్, సుశీల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## అనిబిసెంట్ కాలేజ్‌లో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్


ఎంపికైన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థుల ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్, సిగ్నేచర్ డే జరుపుకున్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో తమ కళాశాల విద్యార్థులు 350 మందికి పైగా ఆఫర్ లెటర్స్ అందుకున్నారని తెలిపారు. డెలైట్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, రైనిక్స్ టెక్నాలజీస్, పీడబ్ల్యూసీ, టెక్ మహీంద్ర, జన్‌ప్యాక్, ఐసీఐ, ప్రొడెన్షియల్, లోంబార్డ్‌ల సంస్థల నుంచి అవకాశాలు దక్కాయని తెలిపారు. అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ మోహన్ కార్పొరేట్ లైఫ్‌పై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ రాజవల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సమాజహితానికి పని చేసే వారే నిజమైన నాయకులు


ఉప్పల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆకృతి సంస్థ ప్రతినిధులు

నాగోలు: సమాజహితం కోసం నిస్వార్థంగా పని చేసినవారే నిజమైన నాయకులు అని ఆకృతి సంస్థ అధ్యక్షుడు ఆకృతి సుధాకర్ అన్నారు. ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అక్షయ తృతీయ సందర్భంగా శనివారం నాగోల్‌లోని ఉప్పల ఫౌండేషన్ కార్యాలయంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తాను ఆకృతి పక్షాన సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ఉప్పల ఫౌండేషన్ ద్వారా పేద యువతుల వివాహానికి మంగళ సూత్రం, మెట్టెలు, నూతన వస్త్రాలు అందించడం, పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని శ్రీనివాస్ గుప్తాను అభినందించారు. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, ప్రముఖ సినీ కవి వడ్డేపల్లి కృష్ణ, మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ మహిళా నాయకులు గౌరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్:సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 50, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 32, ఆలు 31, ఉల్లి 20, గోకర 29, దోస 18, సొర 09, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 55, అర్వి 40, మునగ 28.






## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

-సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ జానకి

సైదాబాద్: ఎన్నికల విధుల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి సూచించారు. శనివారం చంపాపేటలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోని పది పోలీస్ స్టేషన్ల సిబ్బంది, అదనపు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తులో ఉండే సిబ్బంది అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలన్నారు. ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. జోన్ అడిషనల్ డీసీపీ, ఏసీపీలు, పది పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయం: ఇద్దరి అరెస్టు

సైదాబాద్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీకి చెందిన నేనావత్ రవి, ఇస్లావత్ మాత్రూలు సమీప దుకాణాల నుంచి మద్యం తీసుకొస్తున్నారు. వైన్ షాపు మూసివేసిన తర్వాత రాత్రి సమయాల్లో అధిక ధరలకు ఆ మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు దాడులు జరిపి 105 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.